# బ్రహ్మాస్త్రం

"మెప్పుకు లొంగనివా డెవడు?" అని ప్రశ్నించి రామ్మూర్తి తనే సమాధానం చెప్పుకున్నాడు. "ఎవడూ లేడు!"

'మెప్పుకు లొంగిపోకుండా వుండటం ఒక ఘనత అని కూడా నేను నమ్మను. అట్లా లొంగని కర్కోటకు డెవడన్నా వుంటే వాడిది వ్యర్థ జీవిత మన్నమాట. వాడికి యితర ప్రాణికోటితో సంబంధం లేదన్నమాట. సార్థకజీవీ, ఇతరులతో సంబంధం వున్నవాడూ అయిన తరువాత మెప్పు లేకుండా ఎట్లా జీవించగలడూ?

'పిల్లల మెప్పు కోరని తల్లిని చూశావూ? ప్రేయసి మెప్పు కోరని ప్రియుణ్ణెరుగుదువూ? ప్రజల మెప్పు కోరని నాయకుణ్ణీ, గృహీతల మెప్పు కోరని దాతనూ, దేవుడి మెప్పు కోరని భక్తుణ్ణీ ఎరుగుదువూ?'

'అయితే ఏమిటంటావు?' అన్నాను.

'భట్రాజుల్నీ, వాళ్ళను పోషించేవాళ్ళనీ తప్పు పట్టటం దేనికంటాను!'

'ఎవరు తప్పు పట్టారూ?'

'మనమే.'

'లేదే! మనం ఇప్పుడసలు భట్రాజుల గొడవే ఎత్తలేదే. ఈ బొంబాయి పట్టణంలో ఈ దిక్కుమాలిన హోటల్లో చిక్కుపడ్డామే. మన దగ్గిర రెండణాల న్నరకంటే లేదే, ఇవాళో, రేపో హోటలువాడు మనకు నోటీసిస్తాడే, బాకీ ఇస్తే గాని కూడు తిన్నివ్వడే, ఇంటికి రాసిన ఉత్తరాలకు సమాధానమైనా లేదే, ఏమిట్రా భగవంతుడా అని కాదురా మనం ఏడుస్తున్నదీ? భట్రాజులంటావేమిటి? నీ మొహం ఈడ్చా?' అని రామ్మూర్తిని నీరసంగా కోప్పడ్డాను.

'ఈ గండం గడిచి మనం బయట పడేందుకు నేను వుపాయం చెబుతున్నాను వినోరి. మనం భట్రాజుల మవుదాం!'

'అయి?'

'కనబడ్డవాళ్ళందర్నీ తెగ మెచ్చుకుందాం!'

'తరువాత, తరువాత?'

'ఏమవుతుందో చూతాం. నా వుద్దేశంలో మెప్పు ఊరికేపోదు. మెచ్చుకోవటమనే రాజోద్యోగం వుండగా అంతా ఆ వుద్యోగాలకీ ఈ వుద్యోగాలకీ ఎందుకు పరిగెత్తుతారో నా కర్థం కాకుండా ఉంది.'

'సరే, అయితే ఇవాళ హోటలు ప్రొప్రయిటరుతో ప్రారంభించు చూతాం!' అన్నాను. నన్ను తోడు రమ్మంటే మాత్రం ససేమిరా అన్నాను.

రామ్మూర్తి చిన్నబుచ్చుకున్నట్టు కనపడ్డాడు.

'ఒరే నేను నీ వెంట వుండటం నీకే నష్టం. తీరా సమయానికి నవ్వినా, వెధవ మొహం పెట్టినా నాతో తంటా రావచ్చు. నువ్వే పోయి కార్యం సానుకూలం చేసుకురా, 15 రోజులు గడువు తీసుకురా చూతాం,' అన్నాను.

రామ్మూర్తి ఏం చేశాడో తెలియదు. అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చి రెండు రూపాయలు నా అరిచేతిలో పెట్టాడు.

'ప్రొప్రయిటరు అప్పు పెట్టాడు!' అని నేను వెయ్యని ప్రశ్నకు సమాధానం చెప్పాడు.

'రీగల్లో—'

'నేనూ అదే అనబోతున్నాను. ఇద్దరన్నదమ్ములకు ఒకటే సినిమా. హోటలుకు చుట్టా లెవరో వస్తారు!'

రీగల్ థియేటర్లో సినిమా చూసుకుని, బోరీబందరు చేరి, పురోహిత్తు హోటల్లో సుష్టుగా తిని, మళ్ళీ ట్రామెక్కి అర్ధరూపాయి డబ్బులతో తిరిగి బసకు జేరుకునేటప్పటికి రామ్మూర్తి కోసం ప్రొప్రయిటరు ఎదురు చూస్తున్నాడు.

రామ్మూర్తిగాడు హోటలు యజమాన్ని ఏం పొగడాడో నాకు తెలీదాయిరి. ఒకవేళ సాయంకాలపు పత్రికలో అవన్నీ అబద్ధాలని రుజువయిందో ఏం ఖర్మమో నా కెందుకని రామ్మూర్తిగాణ్ణి హోటలు యజమానివాత వదిలేసి నా దారిన నేను గదికి చక్కా వచ్చి చూస్తును గదా, మా గదిలో ఒక వ్యాస మహర్షి, ఒక ప్రహ్లాదుడూ వున్నారు!

మాది నాలుగు పలకల — కాదు, నాలుగు పడకల — గది. అందులో కొంత కాలమై నేనూ రామ్మూర్తీ ఏకచ్ఛత్రాధిపత్యం — లేక ద్విచ్ఛత్రాధిపత్యమో — చేస్తున్నాం. మూడో ప్రాణి మా గదిలోకి అడుగుపెట్టినట్టాయెనా వాణ్ణి తెలుగులో అల్లరిచేసి మరో గదికి వెళ్ళగొట్టుతున్నాం. ఒక పూట మా పొత్తున వున్న మీదట మమ్మల్ని వదిలించుకోవటానికి వాళ్ళే ఆత్రపడేవాళ్ళు. మేమెంత బతిమాలినా వుండేవాళ్ళు కాదు.

విజయోన్మత్తులమై కంద కావరంమీద వున్న నాకు— క్షమించండి 'నాకు' అనే మాట తొస్సుపోతున్నది. మాకు అనే మాట అందును గాని నా వెంట రామ్మూర్తిగాడు లేడాయిరి. ఇది మంచి గ్రామరు పాయింటె. డెల్హీగ్రామపు వార్తల్లో లాగా పై వాక్యం మళ్ళీ చెబుతాను. విజయోన్మత్తులమై కంద కావరం మీద వున్న మా ఇద్దరిలో ఒకణ్ణయిన నాకు (ఓ.కే, బాస్?) ఆ వ్యాసులవార్నీ, ఆ ప్రహ్లాద మళకాన్నీ చూస్తూనే మండుకొచ్చింది.

'మీ రెవరు?' అన్నాను ఇంగ్లీషులో.

'మాకు జాతీ నీతీ లేదు!' అన్నాడు వ్యాసుడు. (నీతి లేదని ఒకవేళ అనలేదేమో. అటువంటి మాట తనకు తానై ఎందుకంటాడు?).

'ఈ కుర్రవాడు నీకేమవుతాడు?' అన్నాను.

'భగవంతుడు నాకేమవుతాడు? ఏమీ కాడు' అన్నాడు గడ్డపాడు.

'నేను తప్పు విన్నా ననుకున్నాను. ఉత్తర సాక్ష్యానికి పనికొస్తుందని ఆ మాట గడ్డంలోనించి మళ్ళీ అనిపించాను.

'ఈ కుర్రాడు దేవుడా?'

'అవును! ఆ సంగతి మూడులే మెరుగుదురు?'

నేను దిమ్మరపోయినాను. నా కింత అవమానం ఎవరూ చెయ్యలేదు. నన్ను వెధవ అన్నవాళ్లున్నారు, నాకు మతి లేదన్నవాళ్ళున్నారు, నాతో అబద్ధాలు

చెప్పినవాళ్ళున్నారు, ఆఖరుకు నన్ను కొద్దిగా మెచ్చుకున్నవాళ్లు కూడా వున్నారు. కాని, ఇంత విడిచేసిన అబద్ధం, ఇంత దిశిమొల అబద్ధం నాతో ఎవరూ సాహసించి చెప్పలేదు.

నా మనస్సులో రేగుతూన్న భావాలు పరమాత్మ అయిన అయొక్క ప్రహ్లాదబాలుడేమైనా గ్రహించాడేమోకాని, వ్యాసుడికి మాత్రం అంతుపట్టలేదు. ఆయన చెప్పుకుపోయినాడు :

'నా పురాకృత కర్మవల్ల నాకడుపున పుట్టిన ఈ భగవంతుడు రాయటమూ, చదవటమూ నేర్చుకోలేదు. బియేలకన్న బాగా మాట్లాదతాడు. అయిదు భాషల్లో ఆరుగంటలు మాట్లాడగలడు. అన్ని భాషల పుస్తకాలూ ఈ కుర్రవాడికి తెలుసును—ఇకముందు రాబోయేవి కూడా కలిపి. మనం పుస్తకాలు చదువుతాం. ఇతను జ్ఞానమే చదివాడు.'

నేను మండిపోతున్న అయిదంతస్తుల మేడల్లే అయిపోతూ కుర్రాడికేసి తిరిగి, "What's eating you!" (అచ్చ తెలుగులో 'నీకేం తెగులు?' అన్నాను.

ఆ కుర్రవాడు పాఠం వప్పచెప్పినట్టు : "I eat all healthy things!" (నేను ఆరోగ్యకరమైన వన్నీ తింటాను!) అన్నాడు.

ఈ సమాధానంలో శ్లాఘించదగిన దేమిటో నాకు కనిపించలేదుగాని, సర్వజ్ఞుడైన వ్యాసమహర్షి కళ్ళు పైకి తేలవేసి, అది నవ్వో మెప్పో అర్థం కాకుండా, 'అహ్హహ్హ! అహ్హహ్హ!' అన్నాడు పారవశ్యంతో.

'రామ్మూర్తిగాణ్ణి రానీ, మీ యిద్దరిభరతమూ పట్టిస్తాం!' అని నేను నాలోనే అనుకుంటుండగా రామ్మూర్తి వచ్చాడు.

'ఏంరా? మళ్ళీ ఇంకో జతరూపాయలు—' రామ్మూర్తిగాడికి కొంచెం వెనకగా హోటలు యజమాని వచ్చి, నాతో ఏదో పని వున్నట్టుగా నాకేసి చూడసాగాడు. రామ్మూర్తిగాడికేసి చూస్తే వాడప్పుడే మాట్లాడుతున్నాడు :

'ఏదిరా, ఆ రసీదు? ఆ టెలిగ్రాం రసీదు? బదులు చెప్పకు! వెతుకు! అరగంటసేపు వెతుకు రసీదు, నావంక చూడకు. రసీదు, టెలిగ్రాం రసీదు.'

నాకు వాడు మాట్లాడేది ముక్కూ మొహమూ తెలియదు. నేను మాత్రం వెతకటం ప్రారంభించాను. ఒక అయిదు నిమిషాలు వెతికినా ఆ రసీదు కనిపించలేదు. నాకది ఎట్లా వుంటుందో అర్థంకాక జేబులో దొరికిన డబ్బులవంకా, తాళం చెవులవంకా కూడా, 'ఆ మహత్తర రసీదు ఇది కాదుగద?' అన్నట్టుగా చూశాను.

అఖరుకు హోటలు యజమాని రామ్మూర్తివంక చాలా దీనంగా చూసి, ఇంగ్లీషువాళ్ళకి కూడా అంతుపట్టని భాషలో, 'ఇది చాలా తప్పు. దెలిగ్రాముకని రెండు రూపాయలు తీసుకోవటం తప్పు!' అని మళ్ళీ మళ్ళీ అని వెళ్ళిపోయినాడు.

'నువ్వు వట్టి వెధవ్వు! చించి అవతల పారేశానని ఐనా ఏడవగూడదూ?'

'నువ్వు భట్రాజువని చేసి రెండు రూపాయలూ సినిమార్థం తెచ్చానను కున్నానుగాని, ఇంటికి దెలిగ్రాం చేస్తానని కేరళం చెప్పించుకున్నానా ఏమిటి?'

'అందు కెంత భట్రాజుతనం చెయ్యాలిసొచ్చిందో నీకేం తెలుసు? ఆ వెధవతిండి మా తెలుగు తిండల్లే ఉందన్న మీదటగాని, ఆ రెండు రూపాయలూ కక్కలేదు వాడు....ఇదేమిటి? వీళ్లెవరు?'

'అందులో ఒకడు మహాభారతగాథ మరిచిపోయిన వ్యాసముని, రెండో వాడు ప్రహ్లాద వేషంలో వున్న దేవుడు! వాడికి కాస్త కాల్షియం డిఫిషెన్సీ ఉంది. అంతకు తప్ప వేరే లోపమేమీ లేదు' అన్నాను.

రామ్మూర్తి చొరవగా వ్యాసులవారితో పరిచయం చేసుకున్నాడు. ఒక గంటసేపు ఏమేమిటో బాతాఖానీ కొట్టారు ఇద్దరూ. నేను వినలేక దాబామీద చల్లగాలిలో షికారుకొట్టి రాబోయినాను.

మా గదిమీకిది దాడివచ్చిన జంటను చూస్తున్న కొద్దీ నాకు ఒళ్లు మండి పోయింది గడ్డంవాడు పొద్దున్నే లేచి రాత్రల్లా తనకు నిద్రపట్టలేదనీ, వక్క సరిగా లేదనీ, అసలు ఇంకోళ్ళు పక్కన వుంటే తనకు నిద్రపట్టదనీ, రోజుకు రూపాయ ముప్పావలా చొప్పున వసూలుచేసే పీనిగలు కొంచెం మంచిగదులూ, మంచి పరుపులూ దిళ్ళూ ఇస్తే ఏమనీ సణిగాడు. పొద్దున్నే స్నానానికి వేడినీళ్ళు కావాలన్నాడు. వేడి నీళ్ళకు బేడా అధికంగా పుచ్చుకుంటారని తెలిసి, ఇంటి కప్పెత్తున ఎగిరివడ్డాడు. చన్నీళ్ళు చేస్తే చేసే జబ్బుకంటే బేడా వదలటంవల్ల మరింత జబ్బు చేసేటట్టు కనిపించింది.

ఇటువంటి వెధవలు బొంబాయివంటి బస్తీలో కూడా ఉంటారా అనుకున్నాను. ఆ మాట రామ్మూర్తిగాడితో అంటే వాడు నన్ను నిరుత్సాహ పరిచాడు. 'అమ్మ, వాళ్ళు నిజంగా గొప్పవాళ్ళురా!' అన్నాడు.

నిన్న సాయంకాలం హోటలు యజమానిని మెచ్చుకున్నప్పటి నుంచీ వాడికి మతి పోయిందనుకున్నాను. ఏ విద్యకైనా అభ్యాసం ఉండాలి. చాతకాని ఉపాసన మా రామ్మూర్తిగాడి నెత్తి అడిచి ఉండాలి.

అకస్మాత్తుగా వ్యాసముని దౌర్జన్యానికి ఉపక్రమించాడు. హోటలు

యజమాని వచ్చి నన్నూ మా రామ్మూర్తినీ ఆ గది ఖాళీచేసి ఇంకో గది చేరమన్నాడు. రామ్మూర్తిగాడు ఎంత అల్లరి అయినా చెయ్యవచ్చునా - హోటలు యజమానితో కాస్త లావాదేవీ ఉన్నవాడు కూడా గదా — కుక్కిన పేనల్లే తల ఒగ్గి ఊరుకున్నాడే గాని, తన జన్మహక్కు కోసం మగవాడల్లే ఒక రక్తపుచుక్క గాని, ఆడదానల్లే ఒక కన్నీటి చుక్క గాని రాల్చిన పాపాన పోలేదు.

ఇంత చేసినా కూడా రామ్మూర్తి గడ్డంవాడి చుట్టూ తిరగటం చూస్తే నాకు వాడి మీద మరీ అసహ్యం పుట్టింది. బొంబాయి వస్తూనే ఆ దొంగ సన్యాసులు సంపాదించిన మొదటి శిష్యుడు మా రామ్మూర్తిగాడు, రాను రాను వాడు నాకు కనిపించటమే మానేశాడు. వాళ్ళతోనే తిరుగుతున్నాడు. ఆ కుర్ర ప్రహ్లాద వెధవ ఎక్కడెక్కడో ఉపన్యాసాలు చేస్తున్నాడట. వీడుకూడా అక్కడి కల్లా పోతున్నట్టు నా కనుమానంకలిగి అడిగితే, రామ్మూర్తి నీళ్ళు నమిలాడు. ఇంకా దబాయిస్తే కొన్ని పేపర్లుతీసి, వాటిలోవద్ద కుర్రాడి ఫొటో, అందులో వాడి మీద నలుగురూ రాసిన ప్రశంసా వాక్యాలు చూపి, 'వీళ్ళంతా వెధవలేనా?' అన్నాడు.

ఇట్లా ఓ పదిహేను రోజులు గడిచినై. మాకింకా హోటలువాడు వాడి ధర్మమా అని తిండి పెడుతూనే ఉన్నాడు గాని, డబ్బు మాత్రం కానీ కూడా లేదు చేతిలో. రామ్మూర్తిగాడు ఎట్లాగో ఊరంతా తిరుగుతున్నాడు ముసలాడి వెంట. నా కదీ లేదు.

ఆఖరుకు ముసలాడి వడుచాడి పీడ విరగడయింది.

'నీ ఆట అయింది వెధవా! ఇన్నాళ్ళూ బొంబాయంతా చెడ దిరిగావు. ఇంక ఏ ఆట లాడతావు? హోటలువాడి కేమి సమాధానం చెపుతావు?' అన్నాను.

రామ్మూర్తిగాడు జేబులో చెయ్యిపెట్టి రూపాయల కట్ట పైకి తీశాడు. నా కళ్ళు తిరిగిపోయినై.

'యాభై రూపాయలు, భట్రాజుతనానికి ప్రతిఫలం!'

'ఎక్కడ సంపాదించావు?' అన్నాను.

'దేవుడు బొంబాయి విడిచిపోతేనేం. భక్తులు బొంబాయిలోనే ఉన్నారుగా.

రెండు చేతులా ఎడా తెరిపి లేకుండా గణించే ఈ వ్యాపారస్తులకు — ఈ రూపాయి చెట్లకు — భగవంతుడే స్వరూపంలో కనిపిస్తాడో నీకేం తెలుసురా, శుంఠా? ఆ కుర్ర కుంక వచ్చాడంటే దేవుడి పరంగా ఖర్చు చేసేటందుకు వాళ్ళ కెంత అవకాశం? ప్రతి భక్తుడూ నన్ను బాగా ఎరుగును. తలో అయిదూ పదీ అప్పు పెట్టారు నాకు.'

